నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, శనివారం 10 ఆగస్టు 2024 SIDDIPET



సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి చెక్‌డ్యామ్‌పై నుంచి దిగువకు ప్రవహిస్తున్న కూడవెల్లి వాగు

## ప్రవహిస్తున్న కూడవెల్లి వాగు

మిరుదొడ్డి, ఆగస్టు 9: ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా 15 రోజులుగా సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలోని కూడవెల్లి వాగు ప్రవహిస్తున్నది. మిరుదొడ్డి మండలంలోని అల్వాల, అందె, మిరుదొడ్డి చెక్‌డ్యామ్‌లు నిండుకొని మల్లుపల్లి చెక్ డ్యామ్‌లోకి నీరు దిగువకు వస్తున్నది. మండల వ్యాప్తంగా భారీ వర్షం పడకున్నా ఎగువన కురిసిన వర్షాల కారణంగా చెక్‌డ్యామ్‌లు నీటితో నిండడంతో కూడవెల్లి వాగు పరీవాహక ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

## పర్యావరణాన్ని పరిరక్షించాలి

**ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి**

గజ్వేల్, ఆగస్టు 9:ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపాలిటీలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతియేడు కోట్లాది మొక్కలు నాటామని, కేసీఆర్ మంచి లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో నేడు తెలంగాణ పచ్చదనంతో కనిపిస్తున్నదన్నారు. ఇప్పుడు మనం నాటే మొక్కలు రాబోయే తరాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సిబ్బందితో కలిసి మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, సూపర్‌వైజర్ మహిపాల్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ.రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, శ్యామలా మల్లేశం, అధికారులు పాల్గొన్నారు.



మెదక్ జిల్లా కౌల్చారంలోని సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## మొక్కలు నాటి సంరక్షించాలి

**ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

కౌల్చారం, ఆగస్టు 9: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా కౌల్చారం మండల కేంద్రంలోని సాంఘి, సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం శ్రావణ శుక్రవారం, నాగుల పంచమి సందర్భంగా మండలంలోని రంగంపేటలోని మాధవానంద సరస్వతీ ఆశ్రమ పీఠాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి మాధవానంద సరస్వతీ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాధాకిషన్, తహసీల్దార్ గఫార్‌మియా, ఎంపీడీవో కృష్ణవేణి, ఏపీవో మహిపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్‌గుప్తా, యువత విభాగం అధ్యక్షుడు సంతోష్‌రావు, మాజీ ఎంపీపీ మంజులాకాశీనాథ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ముత్యంగారి సంతోష్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కరెంట్ రాజాగౌడ్, యాదాగౌడ్, ఇంద్రసేనారెడ్డి, నరేందర్‌రెడ్డి, చిట్యాల యాదయ్య, గౌరీశంకర్, ముత్యం ప్రవీణ్‌కుమార్, చెన్నయ్య, పాండ్ర వెంకటేశం, చింతలగారి కృష్ణ, నెల్లి కిష్టయ్య, సంజీవరావు, మల్లేశం, వినోద్‌నాయక్, సోమనర్సింహులు, చెలం యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలోని బీసీహాస్టల్ ఆవరణంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, అధికారులు, విద్యార్థులు

## వన మహోత్సవంలో అందరూ పాల్గొనాలి

**ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు**

ఝరాసంగం, ఆగస్టు 9: వన మహోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలోని బీసీ బాలుర వసతి గృహం ఆవరణలో అధికారులు, విద్యార్థులు, నాయకులతో కలిసి ఆయన మొక్కలు నాటి నీరుపోశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.11,09,500 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అంతకుముందు కేతకీ సంగమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ రాజగోపురం ఎదుట ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సంగమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యేను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్, బీఆర్ఎస్ మండల నాయకులు సంగమేశ్వర్, బస్వరాజ్, ఆయా శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## డెంగీతో విద్యార్థి మృతి

గజ్వేల్, ఆగస్టు 9: డెంగీతో ఏడో తరగతి విద్యార్థి మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీలోని పల్లెపహాడ్‌లో చోటుచేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శివలింగుస్వామి, కవిత దంపతుల కుమారుడు బన్నీ(11) ఎటిగడ్డకిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గురువారం అతడు తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు గజ్వేల్‌లోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు బన్నీని పరీక్షించిన తర్వాత మెరుగైన చికిత్స కోసం సిద్దిపేటకు తీసుకెళ్లాలని తెలుపగా సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అందరితో కలుపుగోలుపుగా ఉండే బన్నీ మృతి చెందిన విషయం తెలువడంతో తోటి స్నేహితులు, బంధువులు, శోకసంద్రంలో మునిగిపోయారు. శుక్రవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు బన్నీ డెంగీతో మృతి చెందిన విషయం తెలువడంతో సంతాపం తెలిపి సెలవు ప్రకటించారు.



బన్నీ(ఫైల్)



సిద్దిపేట జిల్లా ఎన్సాన్‌పల్లి గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

# పల్లెలపై పట్టింపేది?

- ఏమాత్రం పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఏడు నెలలుగా రూపాయి విడుదల చేయలేదు.
- గ్రామ పంచాయతీ కార్యదర్శుల జేబులు గుల్ల
- అందినకాడికి అప్పులు తెచ్చి పెడుతున్న కార్యదర్శులు
- 'స్వచ్ఛదనం- పచ్చదనం'కు నిధులేవి..? నామమాత్రంగా నిర్వహణ
- పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం.. విజృంభిస్తున్న జ్వరాలు



సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారం



సిద్దిపేట జిల్లా పొన్నాల గ్రామంలో పేరుకుపోయిన చెత్త

సిద్దిపేట, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దేశానికి పట్టుకొమ్మలైన పల్లెల అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించింది. ఏడు నెలలుగా పల్లెలకు రూపాయి నిధులు విడుదల చేయకపోవడంతో ఇవ్వాళ గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. చిన్నపాటి వర్షాలకు అంతర్గత వీధులు చెరువులను తలపిస్తున్నాయి. వీధులన్నీ చిత్తడిగా మారిపోయాయి. గ్రామాలను పట్టించుకున్న వారే కరువయ్యారు. వానకాలం కావడంతో పారిశుధ్యం పడగ విప్పుతున్నది. దోమలు విజృంభిస్తున్నాయి. పల్లెలు జ్వరాలు బారిన పడ్డాయి. ప్రత్యేకాధికారుల పాలన పంచాయతీ కార్యదర్శులపైనే భారంపడటంతో వారు అప్పు తెచ్చి చేతనైన కాడికి పెట్టారు. ఇక ముందు తాము అప్పులు తేలేమని, ఇలాఅయితే గ్రామాల్లో పనిచేయడం కష్టమని వారు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూపాయి కూడా నిధులు విడుదల చేయ లేదు. కార్మికులకు నెలల తరపడి జీతాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. మాజీ సర్పంచ్‌లు గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు రావాల్సి ఉన్నది. కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమకు బిల్లులు విడుదల చేయడం లేదని వారు వాపోతున్నారు. పల్లెలకు నిధుల విడుదల, గ్రామాల అభివృద్ధి, పారిశుధ్య కార్మికుల వేతనాలు, కార్యదర్శుల కష్టాలు, సర్పంచ్‌ల బకాయి బిల్లులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

### స్వచ్ఛదనం-పచ్చదనానికి నిధులేవి..?

స్వచ్ఛదనం-పచ్చదనం పేరిట ప్రభుత్వం పెట్టిన కార్యక్రమానికి ఒక్క రూపాయి బడ్జెట్ కూడా ఇవ్వలేదు. ఇప్పటికే పంచాయతీల్లో రూపాయి లేక ఇబ్బంది పడుతున్న కార్యదర్శులకు ఇది పెనుభారంగా మారింది. గ్రామాల్లో ఐదు రోజులపాటు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చేశామా అంటే చేశాము అన్నట్లుగా జరుగుతున్నది. రూపాయి ఇవ్వకుండా కార్యక్రమాన్ని చేయమంటే ఎలా అని పలువురు కార్యదర్శులు వాపోతున్నారు. ఇప్పటికే చిన్నచిన్న అవసరాలకు తోడు గ్రామాల్లో బోరుమోటర్లు, వీధిలైట్లు, పారిశుధ్య పనులకు జేబులో నుంచి పెట్టుకొని అప్పులపాలయ్యామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీరు పెట్టుకోండి తర్వాత మీ అకౌంట్‌లో జమ చేస్తామంటూ జిల్లా అధికారులు పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఎలాగైనా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు. దీంతో పంచాయతీ కార్యదర్శులు మానసిక వేదనకు గురవుతున్నారు.

### రూపాయి ఇవ్వని సర్కారు

గ్రామ పాలక వర్గాలు ముగిసి ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. నిధులు విడుదల చేయకుండా గ్రామాలను బాగు చేయాలంటే ఎలా .? అని క్షేత్రస్థాయి అధికారులు వాపోతున్నారు. వానకాలం కాబట్టి పారిశుధ్య పనులతోపాటు గ్రామాల్లో చిన్న చిన్న అవసరాలకు నిధులు అవసరం, నిధులు లేకుండా తాము ముందుకు పోలేమని కార్యదర్శులు చెబుతున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో నిధులు ఇవ్వకుండా తాము గ్రామాల్లో డ్యూటీలు చేయలేమని ఆయా మండల ఉన్నతాధికారులకు వినతి పత్రాలను సైతం అందజేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో 499 జీపీలు, మెదక్ జిల్లాలో 469 జీపీలు, సంగారెడ్డి జిల్లాలో 647 జీపీలు ఉన్నాయి.1 ఫిబ్రవరి 2024తో పాలక వర్గాల పదవీకాలం ముగిసింది. దీంతో ఆ రోజు నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. పల్లెల్లో ఏ అభివృద్ధి చేయాలన్నా నిధులు అవసరం. గ్రామానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించినా అతడు చుట్టపు చూపులా వచ్చిపోవడం తప్ప మరోటి లేదు. గ్రామాల్లో ఉండే పంచాయతీ కార్యదర్శులపైనే అధిక భారం పడుతున్నది.



అక్కన్నపేట: తహసీల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో పేరుకుపోయిన చెత్త

### వణికిస్తున్న జ్వరాలు

ప్రభుత్వం గ్రామాలను పట్టించుకోకపోవడంతో రోజురోజుకూ జ్వరాల బారిన పడే ప్రజల సంఖ్య పెరుగుతోంది. డెంగీ, టైఫాయిడ్, ఒళ్లు నొప్పులు తదితర వాటితో జనాలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో గడ్డి విపరీతంగా పెరగడంతోపాటు లోపించిన పారిశుధ్యంతో పల్లెలు దర్శనమిస్తున్నాయి. వానకాలం రాగానే బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించి అందుకు తగ్గట్టుగా నిధులు విడుదల చేసి గ్రామాలను శుభ్రంగా ఉంచింది. దీంతో గ్రామాలు శుభ్రంగా ఉండడంతో తక్కువ సంఖ్యలో మాత్రమే కేసులు నమోదయ్యాయి. ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలను పట్టించుకోవడం లేదు. చాలా గ్రామాలు, తండాల్లోని ప్రజలు మంచం పడుతున్నారు. రోజురోజుకూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. వీధులు అపరిశుభ్రంగా మారడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. డెంగీ కేసులు భారీగా నమోదవుతున్నాయి. ఇటీవల డెంగీతో ఉమ్మడి మెదక్ జిల్లాలో పలువురు చనిపోయిన విషయం తెలిసిందే. కొన్ని గిరిజన తండాలు అయితే పూర్తిగా జ్వరాలతో వణికిపోతున్నాయి. తాగునీటి సరఫరాలో పైప్‌లైన్ లీకేజీలు, వాటర్ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉండడంతో తాగునీరు కలుషితమవుతున్నది.

## స్వాతంత్ర్య ఉద్యమంలో 'క్విట్ ఇండియా' కీలకం

**రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్**

హుస్నాబాద్, ఆగస్టు 9:బ్రిటీసోళ్ల నుంచి దేశానికి విముక్తి కలిగించడం కోసం జరిగిన స్వాతంత్ర్య సంగ్రామంలో క్విట్ ఇండియా ఉద్యమం అనేది ఎంతో కీలకమని, ఈ ఉద్యమంతోనే ఆంగ్లేయులు దేశం నుంచి వెళ్లిపోవాలనే నిర్ణయానికి వచ్చారని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా పార్టీ, జాతీయ జెండాలను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గాంధీజీ ఇచ్చిన ఒక్క పిలుపుతో క్విట్ ఇండియా ఉద్యమంలో కలిసికట్టుగా ప్రజలు పాల్గొన్నారని, అదే స్ఫూర్తితో ప్రస్తుతం గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. గ్రామాల్లో వాతావరణ సమతుల్యానికి మొక్కలు నాటడం, పరిశుభ్రమైన పల్లెలను తయారు చేసుకొని గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించుకుందామన్నారు. గ్రామస్థాయి నుంచి అఖండ భారతదేశం వరకు ఉన్న ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా ఐక్యంగా కష్టపడాలన్నారు. స్వాతంత్ర్య ఫలాలను అందరికీ చేరే విధంగా అటు పాలకులు, ఇటు ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొలిశెట్టి శివయ్య, కేడం లింగమూర్తి, వల్లపు రాజు, భూక్యా సరోజన, చిత్తారి పద్మ, మడల జయపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, పున్న సది, ఎగ్గిడి అయిలయ్య, వీరన్న పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జెండావిష్కరణ అనంతరం జెండావందనం చేస్తున్న మంత్రి పొన్నం తదితరులు

## గౌరవెల్లి, గండిపల్లి నుంచి నీళ్లందిస్తాం

**రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్**



అక్కన్నపేట: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో వనమహోత్సవంలో భాగంగా ఈత మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట, ఆగస్టు 9: మెట్ట ప్రాంతానికి గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల ద్వారా సాగునీళ్లు అందిస్తామని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని పోతారం(జే) గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో భాగంగా ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..బీడు భూముల్లో పండ్ల తోటలు, కూరగాయలు, ఇతర పంటలు పండించాలన్నారు. ఇందుకు వ్యవసాయశాఖ, అనుబంధ రంగాల సహకారం ఉంటుందన్నారు. ఖాళీ భూముల్లో ఈత, తాటి, ఇతర మొక్కలు నాటాలని సూచించారు. కుల వృత్తులకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. అన్ని కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతకుముందు ఆయన ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. త్వరలోనే భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించి ఎన్‌జీటీలో ఉన్న కేసులను ఉపసంహరించుకునేలా ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ జయదేవ్ అర్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌మూర్తి, హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సీఐ పవన్, తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో జయరామ్, ఏపీవో ప్రభాకర్, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు యాదగిరి, సింగిల్ విండో డైరెక్టర్ బండి కుమార్, అయిలయ్య, సంజీవరెడ్డి, జయపాల్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

**మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్**

మెదక్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్థానిక ఎన్నికల సన్నద్ధంపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. నూతన వార్డుల ఏర్పాటు, వార్డుల విభజన, జనాభా, లింగనిష్పత్తి ప్రాతిపదికన రికార్డు చేయాలన్నారు. రిజర్వేషన్ల అంశం ప్రభుత్వ పరిధిలో ఉన్నందున తదుపరి ఆదేశాలు వచ్చే వరకు గ్రామ, మండల స్థాయిలో సమాచారాన్ని క్రోడీకరించుకోవాలని సూచించారు. సమావేశంలో మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఎంపీవోలు, ఎంపీడీవోలు, ఆపరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 78 స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించి దేశానికి సేవచేసిన ప్రముఖులను స్మరించుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో బారికేడ్, పార్కింగ్ వేదిక ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. మెదక్ పట్టణం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆహ్వాన పత్రికలు ముద్రించి అతిథులు, స్వాతంత్ర్య సమరయోధులకు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

## ఐదేండ్ల ఎమ్మెస్సీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియాయూనివర్సిటీ, ఆగస్టు 9:ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఐదేండ్ల ఎమ్మెస్సీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పరీక్ష ఫీజు స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు నాలుగు, ఆరు, ఎనిమిదో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, మొదటి, రెండు, మూడు, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 20లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.300 అపరాధ రుసుంతో 27 వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని, వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## ప్రాణం తీసిన ఇన్‌స్టాగ్రామ్ పరిచయం

- నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని తేజస్విని
- సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగులో ఘటన

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్ పరిచయం ఓ యువతి ప్రాణం తీసింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పీఎస్ పరిధిలోని దోమడుగులో చోటుచేసుకున్నది. సీఐ సుధీర్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని దాచారం గ్రామానికి చెందిన రామారం రాజు ఉపాధి కోసం దోమడుగులో స్థిరపడ్డాడు. కూలిపని చేసుకుంటూ కొడుకు, కూతురును చదివిస్తున్నాడు. కూతురు తేజస్విని(21) బీఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్నది. కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన అదే గ్రామానికి చెందిన శ్రీహరితో తరచూ చాటింగ్, ఫోన్ సంభాషణ చేసేది. ఇదే అవకాశంగా భావించిన ఆ యువకుడు ప్రేమ, పెండ్లి పేరుతో వేధింపులకు గురిచేశాడు. ఈ విషయాన్ని యువతి తల్లిదండ్రులకు చెప్పడంతో బెదిరించాడు. మనస్తాపానికి గురైన యువతి గురువారం రాత్రి ఇంట్లోని నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబ సభ్యులు హుటాహుటిన మల్లారెడ్డి దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందింది.శుక్రవారం విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆందోళన చేశారు. పారిశ్రామికవాడలో కొంతమంది యువకులు గంజాయి మత్తులో యువతులను వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రి ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

